# సామాజిక- ఆర్థిక ప్రగతికి ప్రణాళికీకరణ ఆవశ్యకత

**ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రణాళికీకరణ ప్రధాన లక్ష్యం. పంచవర్ష ప్రణాళికల ద్వారా ప్రధాన రంగాల్లో ఉత్పత్తిని పెంచి, మౌలిక సదుపాయాలు ప్రజలకు అందుబాటు లోకి తెచ్చి, సమాన అవకాశాల ద్వారా ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషి జరుగుతుంది.**

మానవుడు లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తాడు. వ్యక్తిగత ప్రగతికి వ్యూహాత్మక ధోరణి అవసరమైనప్పుడు వందల ఏళ్ల పరాయి పాలనకు గురైన ఇండియాలాంటి వర్ధమాన దేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రణాళికీకరణ అనివార్యం. ''ప్రజా సంస్థలు ఆలోచనపూర్వకంగా నిర్ణయించే ఆర్థిక ప్రాధాన్యతలే ప్రణాళిక'' అని నిర్వచించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశం గుండుసూది కూడా తయారు చేసుకోలేనంత వెనుకబడి ఉంది. అలాంటి దయనీయ స్థితిలో ఉన్న మన దేశం.. ముఖ్యమైన మౌలిక రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించడంతో పాటు రోదసీ, సమాచార సాంకేతిక రంగాల్లో మనల్ని పరిపాలించిన బ్రిటన్‌కు పాఠాలు చెప్పే స్థితికి ఎదిగిందంటే.. అది ప్రణాళికీకరణ పుణ్యమే. వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా సౌకర్యాలు, భారీ యంత్రాంగం, వార్తా సౌకర్యాలు, గనులు, ఎరువులు మొదలైన రంగాల్లో ప్రభుత్వం చొరవ తీసికొని ప్రభుత్వరంగ సంస్థల ద్వారా గణ నీయమైన ప్రగతిని సాధించింది.

ప్రణాళిక సంఘం నేతృత్వాన ఇప్పటివరకు పది పంచవర్ష ప్రణాళికలను విజయవంతంగా అమలు చేసి ప్రపంచంలో నాల్గో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. నిన్న మొన్నటివరకు మితిమీరిన జనాభాతో, అతి తక్కువ వృద్ధిరేటుతో సతమతమౌతున్న వెనుకబడిన దేశంగా ఉన్న భారతదేశం, నేడు చైనాతోపాటు 21వ శతాబ్దాన్ని నియంత్రించే మహాశక్తిగా ఎదగడం.. నెహ్రూ కాలంలో ప్రారంభమైన మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పుణ్యమే. 'ప్రణాళిక' అనే భావాన్ని పెట్టుబడిదారి దేశాలు నకారాత్మకంగా నిర్వచించి, నియంతృత్వానికి, కేంద్రీకరణకు మారుపేరుగా వర్ణించాయి. అమెరికా లాంటి దేశం అగ్రరాజ్యంగా ఎదగడానికి 200 ఏళ్లు పడితే, యూరప్‌లో వెనుకబడిన దేశంగా గుర్తింపుపొందిన సోవియట్ యూనియన్ 30 ఏళ్లలోనే అమెరికాతో పోటీపడే స్థితికి ఎదిగిందంటే అది ప్రణాళికా ప్రక్రియ ఫలమే! దాన్ని అనుసరించిన చైనా, ఇండియా వంటి దేశాలు మిగతా ప్రపంచాన్నే సవాలు చేసే స్థితికి ఎదిగాయంటే అది ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానం వల్లనే. మార్కెట్ వ్యవస్థకు పూర్తి స్వేచ్ఛనివ్వడం ద్వారానూ ఆర్థిక ప్రగతిని సాధించవచ్చు. కానీ అది సమాజంలో అంతరాలకు దారి తీస్తుంది. వైవిధ్యానికి మారుపేరైన ఇండియా లాంటి దేశంలో ప్రాంతీయ, వర్గ, కులపరమైన అసమానతలున్నాయి. వీటిని అధిగమిస్తూ సమసమాజాన్ని స్థాపించాలంటే ప్రభుత్వ యాజమాన్యంలో ఆర్థిక ప్రణాళిక అవసరం.

## భారతదేశంలో ప్రణాళికీకరణ లక్ష్యాలు:

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రణాళికీకరణ ప్రధాన లక్ష్యం. పంచవర్ష ప్రణాళికల ద్వారా ప్రధాన రంగాల్లో ఉత్పత్తిని పెంచి, మౌలిక సదుపాయాలు ప్రజలకు అందుబాటు లోకి తెచ్చి, సమాన అవకాశాల ద్వారా ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషి జరుగుతుంది. అభివృద్ధి ద్వారా సామాజి క న్యాయాన్ని సాధించడం ప్రధాన లక్ష్యం. జాతీయాదాయాన్ని పెంచడం ద్వారా ప్రగతి లక్ష్యాన్ని చేరుకుంటే, వనరుల మీద గుత్తాధిపత్యాన్ని తొలగించి, అసమానతలను తగ్గించడం, ఉపాధి అవకాశాలు పెంచడం ద్వారా వ్యక్తిగత స్వావలంబనకు దోహదం చేయడం జరిగింది. నేటికీ 70 శాతం మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తూ, వ్యవసాయాధార వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారి జీవన ప్రమాణాలను పెంచడానికి హరిత విప్లవం ఎంతగానో దోహదం చేసింది. కుటీర, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా, గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి.

ప్రణాళిక సంఘ నేతృత్వంలో రూపొందిన పంచవర్ష ప్రణాళికలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక (1951–56) ప్రజల జీవన ప్రమా ణాలను మెరుగుపరచడానికి లక్ష్యంగా చేసుకుంది. ఇందులో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు తగిన ప్రాధాన్యమిచ్చారు. రెండో పంచవర్ష ప్రణాళిక త్వరితగతిన పారిశ్రామికీకరణను ప్రోత్సహించింది. ప్రాథమిక, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చారు. మూడో పంచవర్ష ప్రణాళిక స్వయంసమృద్ధిని ప్రోత్స హించింది. నాల్గో పంచవర్ష ప్రణాళిక పెరుగుదలతో కూడిన స్థిరత్వానికి, మౌలిక రంగాల్లో స్వయంసమృద్ధి లక్ష్యాలుగా ఎంచుకుంది. ఐదు, ఆరు పంచవర్ష ప్రణాళికలు దారిద్ర్య నిర్మూ లనకు(గరీబీ హటావో), ఏడో పంచవర్ష ప్రణాళిక వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చాయి. ఎనిమిదో పంచ వర్ష ప్రణాళిక రూపకల్పన నాటికి దేశ ఆర్థిక వ్యవస్థలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదారవాదం, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలు ప్రపంచ ఆర్థిక విధానాన్ని ప్రభావితం చేశాయి. భారతదేశం కూడా ఆ ప్రభావానికి గురైంది. అప్పటివరకు అనుసరించిన నిర్దేశిక (డైరక్టివ్) ప్రణాళిక ప్రవృత్తి స్థానంలో సూచనాత్మక (ఇండికేటివ్) ప్రణాళిక చోటు చేసుకుంది. అంటే మార్కెట్ శక్తులకు ప్రణాళిక రూపకల్పనలో భాగస్వామ్యం కల్పించారు. 1992–97 కాలంలో అమలైన ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక దీన్ని ప్రతిబింబించింది. వృద్ధి, ఆధునికీకరణ, స్వయం సమృద్ధి, సామాజిక న్యాయం ప్రణాళిక ముఖ్య లక్ష్యాలైనవి. మొదటి ముప్పై ఏళ్ల ప్రణాళిక చరిత్రలో మన జాతీయాదాయం 3.5 శాతం మాత్రమే పెరిగింది. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ఆచార్య రాజ్‌క్రిష్ణ దీన్ని... ''హిందూ పెరుగుదల రేటు''గా అభివర్ణిం చారు. మిగిలిన దేశాలతో పోలిస్తే తక్కువ అభివృద్ధిగా కనబడినప్పటికి గత వందేళ్ల (ఆంగ్లేయుల హయాంలో) భారత ఆర్థిక వ్యవస్థలో స్తబ్ధత (స్టాగ్‌నేషన్) చోటు చేసుకొన్న నేపథ్యంలో ఆ మాత్రం ప్రగతిని సాధించడం హర్షణీయమే. తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక కాలం నుంచి జాతీయోత్పత్తి

పెరుగుదల ఊపందుకుంది. 5.4 శాతం అభివృద్ధి సాధించడం జరిగింది. పదో పంచవర్ష ప్రణాళిక సమత, సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసింది. దారిద్ర్య నిర్మూలన, ఉపాధి కల్పన, ప్రాథమిక విద్య, జనాభా నియంత్రణ, గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత తాగునీరు, పర్యావరణ పరిరక్షణ మొదలైన అంశాలకు ప్రాధాన్యతనిచ్చింది. 8% వృద్ధి లక్ష్యం కాగా, ఇంధన ధరల పెరుగుదల వంటి కారకాలు వృద్ధిరేటును 7 శాతానికి పరిమితం చేశాయి. 11వ పంచవర్ష ప్రణాళిక త్వరితగతిన ప్రగతి, దాని ఫలాలు అందరికీ సమంగా పంచటానికి ప్రాధాన్యతనిస్తుంది. దారిద్ర్య నిర్మూలన, ధారణీయ (సస్టెయినబ్బల్) ప్రగతి దీని లక్ష్యం. సగటున 10% పెరుగుదల లక్ష్యంగా వ్యవసాయ రంగంలో కనీసం 4% అభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్య, ఆరోగ్య సదుపాయాలు అందరికీ అందుబాటులోకి తేవడం, ప్రాంతీయ, వర్గపర అసమానతలు తొలగించడం, లింగ వివక్ష ను రూపుమాపడం ఈ పంచవర్ష ప్రణాళిక దార్శనికత(విజన్). ఇటీవల ప్రపంచవ్యాప్తంగా సంభవించిన ఆర్థిక సంక్షోభం, పెట్టుబడిదారి వ్యవస్థలోని లొసుగులను తేటతెల్లం చేసింది. ఇండియా, చైనా లాంటి దేశాలు ఈ సంక్షోభాన్ని కొంత వరకు అధిగమించగలిగాయంటే ప్రధాన కారణం.. అవి అవలంబిస్తున్న మిశ్రమ ఆర్థిక విధానాలే. మార్కెట్ శక్తులు సామాజిక వాస్తవికతను పరిగణలోనికి తీసుకోవు. సగటు పౌరుడ్ని ఆర్థికంగా, మానసికంగా కుంగదీసే ప్రగతి... ఎలాంటి ప్రగతి? మార్కెట్ శక్తులను నియంత్రిస్తూ సామాజిక, పర్యావరణ ప్రయో జనాలను రక్షించే ప్రణాళిక విధానం భారతదేశానికి ఎంతైనా అవసరం.